క్లుప్తంగా

పాఠశాల విద్యార్థులకు చేయూత

చీమకుర్తి రూరల్: మండలంలోని పి.నాయుడు పాలెం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు పూనూరి రాజేంద్రప్రసాద్ స్టడీ మెటీరియల్ అందజేశారు. రూ.10 వేల విలువైన ప్యాడ్స్, పెన్స్, పాఠశాలకు హ్యాండ్ మైక్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల కిట్స్ పంపిణీ

సంతనూతలపాడు: స్థానిక ఎస్సీ హాస్టల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, స్థానిక అంబేద్కర్ నగర్, క్రిస్టియన్ పాలెంలలోని 110 మంది పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్ లను సర్పంచ్ రంపతోటి అంకారావు స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం పంపిణీ చేశారు. అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మార్పుడి రామాంజనేయులు, సంఘ నాయకులు డి.ప్రకాశం, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడులో మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉప్పుటూరి బ్రహ్మయ్య పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.రమణ, ఉప సర్పంచ్ జీ సుబ్బారావు, గ్రామ నాయకులు పెరుగు రాము తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ స్వామి ఉపాలయంలో షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో మూడో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేద పురోహితుడు సదాశివయ్య రాజేష్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామి మూలవిరాట్‌కు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆరు గంటలకు మహిళా భక్తులు సామూహిక గురు చరిత్ర పారాయణం చేశారు. ఉత్సవమూర్తికి ఊంజల్ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మండల బార్బర్ షాప్స్ అధ్యక్షుడిగా రమేష్

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల బార్బర్ షాప్స్ అధ్యక్షుడిగా గుంటూరు రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో షుమారు 40 సెలూన్ షాప్‌లు ఉన్నాయి. బార్బర్ షాప్స్ కమిటీ కన్వీనర్ కరేటి నరసింహారావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన యూనియన్ సమావేశంలో గుంటూరి రమేష్ను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా గుంటూరి ఆదినారాయణ, జనరల్ సెక్రటరీగా పచ్చవ వెంకట సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. క్షౌ ర వృత్తి ధరలు, బార్బర్ ల సమస్యలు, దుకాణాలకు అవసరమైన స్థలాల కేటాయింపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హత పై సమీక్ష, ఆదరణ, పలు పథకాల సాధన కోసం పోరాడతామని చెప్పారు.

ప్రజాచైతన్య యాత్రలో సమస్యల వెల్లువ



సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

నాగులుప్పలపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర బృందం మండలంలోని ఉప్పుగుండూరులో దిన్నెమీద చింతతోపులో ఉన్న ఎస్టీకాలనీలో ఆదివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలు బృందం దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో కనీస మౌలిక వసతులు లేవన్నారు. రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి వసతి లేవని, మరుగుదొడ్లు, రేషన్ కార్డులు లేవని కొంతమంది తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జే జయంతిబాబు, టీ శ్రీకాంత్, చీరాల ప్రభుదాస్, యు వెంకటేశ్వర్లు, కే శ్రీను, సుందరయ్య, అల్లాభక్షు, ప్రసన్న, వెంకటకృష్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపట్నం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు తులసి కుమారి, పద్మావతి తెలిపారు. ఆదివారం ఎంఈవో విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలో 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతుండగా 278 మంది బాలురు, 372 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ సెంటర్‌లో 240 మంది, బి.సెంటర్‌లో 240 మంది, సీ సెంటర్‌లో ఈతముక్కల నుంచి 170 మంది పరీక్ష రాస్తున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షలకు 31 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంఈవో పద్మావతి హెచ్చరించారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయమే

సాధారణంగా పరీక్షలంటేనే విద్యార్థుల్లో భయం ఉండడం సహజం. ఒత్తిడిని అధిగమించాలి.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఆత్మవిశ్వాసంతో పరీక్ష కేంద్రాలకు వెళ్లాలని, అప్పుడే అంతా విజయమేనని విద్యావంతులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచిస్తున్నారు. నేటి నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.



పరీక్ష కేంద్రంగా ఉన్న సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్

- నేటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- సంతనూతలపాడు నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి

సంతనూతలపాడు: నేటి నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సంతనూతలపాడు మండలంలో 5 పరీక్ష కేంద్రాల్లో 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వాటిలో సంతనూతలపాడు హైస్కూల్, ఏపీ గురుకుల పాఠశాలల్లో 440 మంది, పేర్నమిట్ట పరిధిలోని గురుదత్త హైస్కూల్, శ్రీ ప్రతిభ జూనియర్ కాలేజీ, పీర్లమాన్యం వద్ద క్విస్ హైస్కూల్ ప్రాంగణంలో 660 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అందులో మొత్తం ఉదయం గం.9.30 నుంచి మధ్యాహ్నం గం.12.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష ప్రారంభానికి అర్ధగంట ముందు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు హాజరు కావాలి. సంతనూతలపాడు ఎస్‌ఐ వేజెండ్ల అజయ్ బాబు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల్లో పోలీసు బందోబస్తు పర్యవేక్షించనున్నారు. పరీక్షల్లో ఎటువంటి కాపీయింగ్ జరక్కుండా అధికారులు గట్టి చర్యలు చేపడుతున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం నియోజకవర్గంలోని పరీక్ష కేంద్రాలను ఎంఈఓ 2 డి.వెంకారెడ్డి పర్యవేక్షించి, సౌకర్యాలను పరిశీలించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

నాగులుప్పలపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల్లో సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో రవి తెలిపారు. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమ్మనబ్రోలు బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 5 పరీక్ష కేంద్రాల్లో 656 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరికి గాను 39 మంది ఇన్విజిలేటర్ లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి



పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రతా ఏర్పాట్లు కూడా పకడ్బందీగా ఉంటాయి. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు కచ్చితంగా కేంద్రం వద్ద ఉండేలా చూసుకోవాలి.

– డి.వెంకారెడ్డి, ఎంఈఓ 2, సంతనూతలపాడు

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి. ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయి. రాత్రి కనీసం 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి. ఇంట్లోనే లభించే పౌష్టికాహారం తీసుకోవాలి. బయట లభించే ఫాస్ట్ ఫుడ్ జోలికి వెళ్లరాదు.

– వజ్రాల మాధవి లత, గణిత ఉపాధ్యాయురాలు, సంతనూతలపాడు హైస్కూల్

తాగునీటి సమస్య తీర్చండి

- సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో నాయకులు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రజా చైతన్య యాత్ర బృందం



ముక్తినూతలపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర బృందం ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. గత 30 సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని, మంచినీళ్లు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. మంచినీటి కుళాయిలకు కనెక్షన్ ఇస్తేగాని సమస్య నుంచి శాశ్వతంగా బయటపడమన్నారు. మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా నీటిని ఐదు రోజులకు ఒకసారి ఇంటికి ఒకటిన్నర డ్రమ్ము మాత్రమే నీరు పోస్తున్నారని, అవి చాలక కొనుక్కోలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కనీసం ఐదు రోజులకు మూడు డ్రమ్ములైనా ఇస్తే సర్దుకొని వాడుకోగలమన్నారు. పీర్లమాన్యం మొదటి లైన్లో బోరింగ్ కూడా లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. కొత్త డొంక నుంచి కర్నూల్ రోడ్డు పైకి వెళ్లే రోడ్డు మార్గంలో అడ్డంగా కరెంటు స్తంభం ఉందని, దానిని పక్కకు మార్పించాలని కోరారు. ముస్లింలకు శ్మశానం పోతురాజు కాలువ కట్ట పక్కన ఉందని, అక్కడికి వెళ్లే మార్గంలో చిల్లచెట్లు మొలిచి ఇబ్బందిగా ఉందని, దారిని శుభ్రం చేయించాలని కోరారు. శ్మశానం దగ్గర నమాజ్ చేసుకోవడానికి ఈద్గాకు స్థలం కేటాయించాలని వారు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ ప్రభుత్వం పదేళ్ల క్రితం రూ.123 కోట్ల అంచనాతో ఓవర్ హెడ్ ట్యాంకు, సమ్మర్ స్టోరేజ్ లను పీర్లమాన్యం ఎదురుగా ఉన్న కర్నూలు రోడ్డు పక్కన ప్రారంభించారని వాటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బృందంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, నాయకులు కోడూరు రామకృష్ణారెడ్డి, షేక్ కాలేషా, లక్కు తిరుపతయ్య, పీ చిన్న శేషయ్య, బంకా పద్మ, షేక్ మస్తాన్ బి, షేక్ కాశిం, షేక్ పీరయ్య, షేక్ మస్తాన్, షేక్ మస్తాన్ వలి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్: నగర ప్రజల నీటి దాహార్తిని తీర్చడానికి కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌గా మార్చాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు కోరారు. వేసవిలో తాగు నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు, మంచినీటి సమస్య పరిష్కారానికి కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజీగా మార్చడం ఒక్కటే శరణ్యమన్నారు. చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజల కోసం చెరువు గట్టు మీద ట్రాక్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీ ఎం బృందం ఆదివారం కొప్పోలు చెరువును సందర్శించింది. ముక్తినూతలపాడు బీసీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ముక్తినూతలపాడు మంచి నీటి చెరువుకు మెట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సయ్యద్ హుసేన్, తంబి శ్రీనివాసరావు, దారా వెంకటేశ్వర్లు, టి.మహేష్, శ్యాం రవి, సీహెచ్ ఆంజనేయులు, హనుమంతరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఐక్యంగా పోరాడాలి



మత్స్యకారులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న సభ్యులు

కొత్తపట్నం: సమస్యలు పరిష్కరించుకునేందుకు మత్స్యకారులు ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర మత్స్యకార కార్యదర్శి సున్నపు తిరుపతిరావు పిలుపునిచ్చారు. మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా సమావేశం మండలంలోని కె.పల్లెపాలెం తుఫాన్ షల్టర్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు పొన్నపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ మత్స్యకారులకు రావల్సిన మత్స్యకార భరోసా రూ.20 కోసం ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. జిల్లాల వారీగా కబడ్డీ, వాలీబాల్, పడవల పోటీలు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ సత్యన్నారాయణ స్వామి మూలధారణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. మత్స్యకారులకు ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లించడానికి నిధి సమకూర్చుకోవాలన్నారు. మత్స్యకారులకు వివిధ రకాల సమస్యల గురించి వివరించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు తీర్మానించారు. అనంతరం కమిటీలో కొత్తగా కొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్యకార సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొక్కిలగడ్డ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా పొన్నపూడి గోపిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేవు చలపతి వర్మ, ఉపాధ్యక్షుడు నాయుడు ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక రంగంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలి

- జిల్లా డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్



షార్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

ఒంగోలు సిటీ: వైజ్ఞానిక రంగంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడం వల్ల కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాకు చెందిన 140 మంది విద్యార్థులు, 20 మంది ఉపాధ్యాయులు ఈ నెల 14వ తేదీన శ్రీహరికోటలోని షార్ కేంద్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. 15వ తేదీ ఉదయం జవహర్ లాల్ నెహ్రూ నక్షత్రశాల, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ సైన్స్ మ్యూజియంను విద్యార్థులు సందర్శించారని వివరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంపొందించేందుకు ఎక్స్పోజర్ విజిట్లు దోహదపడతాయన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఏఎంఓ రమేష్, జిల్లా అధికారి టి.రమేష్ వ్యవహరించారని తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



బస్టాండ్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



జిల్లా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య కళ్యాణ మండపం, బస్టాండ్ సెంటర్ లోని పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు వాసవీ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అభ్యున్నతికి పొట్టి శ్రీరాములు చేసిన సేవలను వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు కొనియాడారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయ శ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు వేమా శ్రీనివాసరావు, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, ఆర్యవైశ్య నాయకుడు ఎస్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలను స్మరించుకుందాం

ఒంగోలు టౌన్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, దయామణి, లక్ష్మి, ఇమ్మానియేలు, అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ ఎం.సుబ్బారావు, మారం వెంకారెడ్డి

చీమకుర్తి: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సీఐ ఎం.సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆదివారం చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను వారు ప్రారంభించారు. చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో 1985–86 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులైన మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో వారి సహచర విద్యార్థుల సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు సీఐని శాలువాతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు ముప్పూరి రంగారావు, గోపవరపు శ్రీనివాసరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, గుద్దంటి వెంకట్రావు, సూది శ్రీకాంత్, బక్కా రత్నం, జగన్నాథం హెప్సిబా, స్థానికులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

- నివాళులర్పించిన జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పొట్టిశ్రీరాములు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, కొండపి జెడ్పీటీసీ మారెడ్డి అరుణ, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కనిగిరి జెడ్పీటీసీ ఎం.కస్తూరిరెడ్డి, ముండ్లమూరు జెడ్పీటీసీ మోజెష్ రత్నరాజు, జెడ్పీటీసీలు మాసంజాన్‌పాల్, వెంకట నాగిరెడ్డి, మహిళా నాయకులు భూమిరెడ్డి రమణమ్మ, పేరం ప్రసన్న, సాధం విజయలక్ష్మి, సయ్యద్ అప్సర్‌బేగమ్, వెంకయ్యానాయుడు, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.

మాల కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి



సభలో పాల్గొన్న అతిథులు

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఒంగోలు వన్‌టౌన్: మాల కళాకారులకు పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న కోరారు. దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాల కళాకారుల కళా ప్రదర్శనల ఒంగోలులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ.. తెలంగాణాలో కళాకారులకు పెన్షన్ అందించేందుకు రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కుడా కళాకారులకు పెన్షన్‌లను అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. సంతనూతల పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమా, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ.. మాల కళాకారులకు పెన్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ తరతరాల నుంచి కళల మీద ఆధారపడి జీవిస్తున్న మాల కళాకారుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. మాలలు, మాల ఉప కుల కళాకారులకు పెన్షన్, సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, గోగులమంద అరుణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఒంగోలులోని హెచ్‌సీఎం కళాశాల వద్ద నుంచి నెల్లూరు బస్టాండ్ వరకూ మాల కళాకారులు ర్యాలీ నిర్వహించారు.

మురుగు కాలువల్లో పూడిక తీయండి



రోడ్డు పైకి వచ్చిన మురుగు నీటిని చూపిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బృందం

సంతనూతలపాడు: మురుగు కాలువల్లో సంవత్సరానికి ఒక్కసారైనా పూడికలు తీయడం లేదని మంగమూరు ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బృందం మండలంలోని మంగమూరు ఎస్సీ కాలనీలో ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీవాసులను బృందం నాయకులు కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కొన్నిచోట్ల మాత్రమే మురుగు కాలువలు ఏర్పాటు చేశారని, మిగతా చోట్ల అసలు కాలువలే లేవని, కాలువల్లో పూడిక తీయక మురుగు రోడ్ల మీదకు వస్తోందని స్థానికులు వాపోయారు. ఎస్సీలకు 200 లోపు యూనిట్లు కాల్చుకున్న వారికి ఉచిత విద్యుత్ అని గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించలేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు కట్టాలని చెప్తున్నారని వారు తెలిపారు. ప్రజా చైతన్య యాత్ర బృందంలో సీపీఎం నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, అబ్బూరి వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్, అబ్బూరి బసవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ డిపో ఎత్తివేత తగదు



సూరారెడ్డిపాలెం ఐఓసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఒంగోలు టౌన్: సూరారెడ్డిపాలెంలో గత 26 ఏళ్లుగా కొనసాగుతున్న ఐఓసీ డిపోను ఎత్తి వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకోవడం తగదని సూరారెడ్డిపాలెం ఏరియా ఐఓసీ, బీపీసీఎల్ ట్యాంకర్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి. నరసయ్య, కె. అచ్చయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం డిపో ఎదురుగా యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇక్కడ నుంచి నిత్యం 150 ట్యాంకర్ల ఆయిల్‌ను జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తారన్నారు. ఈ డిపోలో ప్రస్తుతం 1000 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని, డిపో ఎత్తివేతతో వారి జీవనోపాధి దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ఈ డిపో ఎత్తివేయకుండా సూరారెడ్డిపాలెంలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.